పశువైద్యశాలకు వసతి సమస్య


ఆస్పత్రికి పాడి ఆవును తీసుకొచ్చిన రైతు


శిథిలావస్థలో అగనంపూడి పశువుల ఆస్పత్రి

అగనంపూడి: అగనంపూడి పశువుల ఆస్పత్రిలో సమస్యలు తిష్ట వేశాయి. పంచాయతీ నాటి పెంకుటిళ్లలోనే కాలం వెళ్లదీస్తోంది. ఎప్పుడు కూలిపోతోందో తెలియని పరిస్థితి. దీంతో సిబ్బంది బితుకుబితుకుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. మూడు దశాబ్దాల క్రితం అగనంపూడి సర్వే నంబర్ 115లోని పది సెంట్ల స్థలంలో పశువైద్యశాల ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి అదే ఆవరణలో కొనసాగుతోంది. అయితే పెంకుటిళ్లు కావడంతో రెండు గదులు శిథిలం కాగా, ఒక గదిలో పశువైద్యశాల కొనసాగిస్తున్నారు. పుష్కర కాలం నుంచి ఆస్పత్రికి స్థలం కేటాయించాలని స్థానిక ప్రజా సంఘాలు పలుమార్లు జిల్లా అధికారులకు, పాలకులకు విజ్ఞప్తి చేశారు. ఆ మేరకు నాలుగేళ్ల క్రితం జిల్లా కలెక్టర్ ప్రస్తుత ఆవరణాన్ని వెటర్నరీ ఆస్పత్రికి కేటాయించారు. అయితే సదరు స్థలం అప్పటికే జీవీఎంసీ స్వాధీనం చేసుకోవడంతో ఆస్పత్రి భవన నిర్మాణం కోసం కేటాయించిన రూ.20 లక్షల నిధులు మురుగుపోయాయి. జీవీఎంసీ నిరభ్యంతర పత్రం ఇవ్వడంలో అలసత్వం వహించడంతో పాడి రైతులకు, సిబ్బందికి ఇబ్బందులు తప్పడం లేదు. ఇక్కడి ఆస్పత్రికి వెదుళ్లనరవ, దువ్వాడ, వెదుళ్లనరవ, నంగినారపాడు, కూర్మన్నపాలెం, వడ్లపూడి, గంగవరం లంకెలపాలెం, పెదముషిడివాడ గ్రామాలతో పాటు సబ్బవరం, పరవాడ మండలంలోని గ్రామాల నుంచి పాడి రైతులు, పెంపుడు జంతువులను వైద్యం కోసం, వ్యాక్సిన్ల కోసం ఇక్కడికి తీసుకొని వస్తున్నారు. సరైన వసతి లేకపోవడంతో ఇక్కడికి వచ్చేవారు కూడా ఎండలోనే శిథిల ఆవరణలో బిక్కుబిక్కుమంటూ ఉండాల్సి వస్తుందని ఆందోళన చెందుతున్నారు. జీవీఎంసీ కమిషనర్, పాలకపక్షం స్పందించి సదరు స్థలాన్ని పశువైద్య శాలకు అప్పగించేలా చొరవ తీసుకోవాలని ఈ ప్రాంత పాడి రైతులు కోరుతున్నారు.

పాడి రైతులను దృష్టిలో పెట్టుకోవాలి

అగనంపూడికి పరిసర మండలాల నుంచి రైతులు పశువులను తీసుకొని వస్తున్నారు. ఎప్పుడు కూలిపోతుందోననే భయాందోళనలో ఆవరణలోకి అడుగు పెట్టాల్సి వస్తుంది. జీవీఎంసీ కమిషనర్, కలెక్టర్ స్పందించి స్థలాన్ని అప్పగించేలా చర్యలు తీసుకోవాలి.

–జి.నరసింగరావు, గంగవరం

జీవీఎంసీ అధికారుల నిర్లక్ష్యం

దేవుడు వరమిచ్చినా పూజారి వరమివ్వని చందంగా ఉంది జీవీఎంసీ అధికారుల తీరు. జిల్లా కలెక్టర్ స్థలాన్ని కేటాయిస్తే. జీవీఎంసీ ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదు. జీవీఎంపీ మేయర్, కమిషనర్‌లు స్పందించాలి.

–పి.రామారావు, దువ్వాడ

పండగ పోస్టర్ ఆవిష్కరణ


అమ్మవారి పండగ మహోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

పెదగంట్యాడ: మండలంలోని చిననడుపూరులోని నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య పండగను ఘనంగా నిర్వహించనున్నామని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు ఆలయ ప్రాంగణంలో ఉత్సవాల పోస్టర్‌ను గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, కార్పొరేటర్లు భూపతిరాజు సుజాత, గంధం శ్రీనివాసరావులు ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగిరెడ్డి మాట్లాడుతూ ఈ ఆలయానికి 43 ఏళ్ల చరిత్ర ఉందన్నారు. ఉత్తరాంధ్రలోనే రెండో అతి పెద్ద విగ్రహం కలిగిన ఈ ఆలయంలో ఏటా కొత్త అమావాస్య, ఉగాది పర్వదినాన ఉత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఇందల ఈశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో తాటికొండ కాశీవిశ్వేశ్వరరావు, తలారి నాగేశ్వరరావు, నాగిరెడ్డి, రాంబాబు, పెద వెంకటరమణ, జగన్నాథ, రామునాయుడు, బొండా అప్పారావు, నరసింగరావు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా బ్రహ్మోత్సవాలు


గౌతంరెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నాగిరెడ్డిని సత్కరిస్తున్న ఆలయ పండితులు

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 86వ వార్డు పరిధి సైమాన్‌నగర్‌లోని శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ధర్మకర్త, వైఎస్సార్‌టీయూసీ అధ్యక్షులు పున్నూర్ గౌతంరెడ్డి దంపతులు ఆధ్వర్యంలో 5 రోజులు పాటు స్వామి వారి బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేసి బ్రహ్మోత్సవాలను ప్రారంభించారు. ఆలయ పండితులు వేద మంత్రోశ్చరణల మధ్య ఎమ్మెల్యే నాగిరెడ్డిని సాదరంగా ఆహ్వానించి ఘనంగా సత్కరించారు. ఈ బ్రహ్మోత్సవాలకు విజయవాడ నుంచి చిన్న జీయర్ స్వామి శిష్య బృందం విచ్చేసింది.

కోతకు గురవుతున్న రోడ్డు


హెచ్‌పీవీపీ సిగ్నల్ పాయింట్ వద్ద కోతకు గురైన రహదారి


కోతకు గురైన ప్రాంతంలో ఇరుక్కుపోయిన కారు

అక్కిరెడ్డిపాలెం: భెల్ (హెచ్‌పీవీపీ) సిగ్నల్ పాయింట్ వద్ద పాతగాజువాక వైపు వెళ్లే సర్వీసు రోడ్డు కోతకు గురవుతోంది. ఇదే ప్రాంతంలో స్పీడ్ బ్రేకర్‌తో పలువురు వాహన చోదకులు నిత్యం ప్రమాదాలబారిన పడుతున్నారు. స్పీడ్ బ్రేకర్ ఉన్న వైపు కోతకు గురై ప్రమాదకరంగా మారింది. సంబంధిత అధికారులు తక్షణం స్పందించి సమస్య పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

ముగిసిన నీలమ్మ జాతర

అల్లిపురం: అస్సాం గార్డెన్స్‌లో వెలసిన నీలమ్మ వేప చెట్టు అమ్మవారి వార్షిక జాతర మహోత్సవాలు ఆదివారంతో ముగిసాయి. ఈ సందర్భంగా అమ్మవారికి భక్తులు విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ బొర్రా విజయలక్ష్మీ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో అర్చకుడు జోగారావు శర్మ అమ్మవారికి పూజలు చేశారు. మధ్యాహ్నం నిర్వహించిన అన్నసమారాధనను వైఎస్సార్‌సీపీ నాయకుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్ ముఖ్య అతిథిగా ప్రారంభించారు.

నాటి ఉక్కు ఉద్యమం నేటి తరానికి స్ఫూర్తి


752వ రోజు ఉక్కు దీక్షలో కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న మస్తానప్ప

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు–ఆంధ్రుల హక్కు అనే నినాదంతో జరిగిన నాటి ఉక్కు ఉద్యమం నేటి తరానికి ఉద్యమ స్ఫూర్తి అని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు వై.మస్తానప్ప అన్నారు. ఈ మేరకు 752వ రోజు కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలో వైఎస్సార్‌టీయూసీ కాంట్రాక్ట్ కార్మికులు కూర్చొని ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వై.మస్తానప్ప కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ రైతులు సాగించిన పోరాట ఫలితంగా మోదీ ప్రభుత్వం మూడు వ్యవసాయ చట్టాలను వెనక్కి తీసుకుందని, స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు అటువంటి పోరాటాలు చేయక తప్పదన్నారు. ఉక్కు నిర్వాసితులు చేసిన ప్రాణత్యాగాలను మోదీ ప్రభుత్వం గుర్తు చేసుకోవాలనాన్నరు. స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయిస్తే ఉత్పత్తిలో పరుగులు పెడుతూ దేశంలో నంబర్ వన్ పరిశ్రమగా ఎదుగుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌టీయూసీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

ఖైదీలకు దంత పరీక్షలు

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారంలో సీఐఐ యంగ్ ఇండియన్ విశాఖపట్నం చాప్టర్, గీతం దంత కళాశాల ఆధ్వర్యంలో 'నేషనల్ కాన్స్–ఎండోడే'సందర్భంగా ఆదివారం దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో గీతం దంత వైద్యులు సుమారు 200 మంది ఖైదీలకు దంత పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు, టూత్ పేస్టులు అందజేశారు.

స్నేక్ క్యాచర్ కిరణ్ సేవలు విలువైనవి


కిరణ్‌ను సత్కరిస్తున్న భారతీయ వికాస్ పరిషత్ ప్రతినిధులు

దాబాగార్డెన్స్: మహా విశాఖ నగరంలో స్నేక్ క్యాచర్‌గా, సర్పజాతి సంరక్షకునిగా పేరొందిన రొక్కం కిరణ్‌కుమార్‌ను భారత్ వికాస్ పరిషత్ రాష్ట్ర శాఖ ఘనంగా సత్కరించింది. నగరంలోని బీవీపీ కార్యాలయంలో కిరణ్ సేవలను గుర్తిస్తూ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా భారత్ వికాస్ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు వంకాయల సన్యాసిరాజు మాట్లాడుతూ ప్రజల ప్రాణాలతో పాటు సర్పాలను రక్షిస్తున్న కిరణ్‌కుమార్ సేవలు కొనియాడదగ్గవని అన్నారు. సర్పాల కోసం తాను చేస్తున్న సేవలను గుర్తించి సత్కరించినందుకు కిరణ్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో భారత్ వికాస్ పరిషత్ ప్రధాన కార్యదర్శి జీవీబీ సుబ్రహ్మణ్యం, రాష్ట్ర సంస్కార్ ఎంవీ రాజశేఖర్, ఆర్సీ జైన్, డీహెచ్‌సీ శాస్త్రి, ఎంవీవీ సత్యనారాయణ, ఎంవీ సూర్యనారయణరాజు, చదరం శివాజీ, జి. వేణుగోపాలస్వామి, వీఎస్‌ఆర్ ఆంజనేయప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కాన్ఫరెన్స్ అధ్యక్షుడిగా సుదర్శనరావు


ఆచార్య సుదర్శనరావు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం అర్థ శాస్త్ర విభాగం విశ్రాంత ఆచార్యుడు ఆర్.సుదర్శనరావు ఏపీ ఎకనామిక్ అసోసియేషన్ కాన్ఫరెన్స్ ప్రెసిడెంట్‌గా నియమితులయ్యారు. ఈ నెల 27, 28 తేదీలలో తిరుపతి ఎస్వీ విశ్వవిద్యాలయంలో నిర్వహించే 39వ వార్షిక సదస్సులో ఆయన అధ్యక్షోపన్యాసం చేయనున్నారు. సదస్సులో మూడు ప్రధాన అంశాలపై చర్చించనున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఆర్థిక వృద్ధి, నూతన విద్యా విధానం, రాయలసీమ ప్రాంతంలో ఆర్థిక ప్రగతి అనే అంశాలపై సదస్సులో విస్తృతంగా చర్చిస్తారు.

గీతాభవన్‌లో నక్షత్రమాల


కృష్ణ భగవానునికి పూజలు చేస్తున్న అతిథులు

దాబాగార్డెన్స్: గీతా ప్రచార సమితిని ప్రారంభించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా లోక కల్యాణార్థం నక్షత్రమాల పేరిట 27 నక్షత్రాలకు.. 27 సార్లు భక్తులందరిచే సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణ నిర్వహించారు. ముందుగా గీతా మందిరంలో వేంచేసిన విశ్వరూప సహిత శ్రీకృష్ణార్జున ప్రతిష్ట మూర్తులకు, గోసహిత శ్రీకృష్ణ భగవానుని ఉత్సవ మూర్తికి ప్రత్యేక పూజలు జరిపారు. ఆధ్యాత్మిక ఉత్సవంలో పాల్గొన్న బ్రహ్మశ్రీ మురళీకృష్ణ భక్తులనుద్దేశించి ప్రసంగిస్తూ శ్రీవిష్ణు సహస్రనామ పారాయణం వల్ల విశ్వశాంతి కలగడమే గాక పాల్గొన్న వారందరికీ శుభాలు కలుగుతాయని అభిలషించారు. గీతా ప్రచార సమితి గత 50 ఏళ్లుగా నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక ఉత్సవాలను ఆయన ప్రశంసించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ప్రచార సమితి గౌరవ అధ్యక్షుడు వై. కృష్ణమూర్తి, అధ్యక్షుడు సీహెచ్ విశ్వేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి జగన్‌మోహన్‌రావు, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, కార్యదర్శి ఎం. వనజాదేవి, జీవీఆర్ ప్రసాద్, లక్ష్మీనరసింహం తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయక సమస్య గ్రంథంతో రైతులకు ఊరట


గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

బీచ్ రోడ్డు: రైతులకు ఎదురవుతున్న సమస్యల పరిష్కారం కోసం క్లార్ కౌట్స్కీ రచించిన వ్యవసాయక సమస్య గ్రంథం ఎంతో ఊరటనిస్తోందని పరిశోధకుడు విద్యాసాగర్ అన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో వ్యవసాయక సమస్య తెలుగు అనువాద గ్రంథ ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయాన్ని మరింతగా అభివృద్ధి చేయడం అనేది ఆధునిక రాజ్యం లక్షణమని, అందుకు జలయజ్ఞమే ఓ ఉదాహరణ అని చెప్పారు. వ్యవసాయం ఒకసారి పెట్టుబడిదారీ వలయంలో చేరుకున్న తర్వాత రైతు శ్రమని రైతు ఉపయోగించుకోలేని పరిస్థితిని సృష్టిస్తుందన్నారు. మరో వక్త జగన్నాథస్వామి మాట్లాడుతూ కార్మిక వర్గంతో చిన్న రైతు కలసి ప్రయాణం చేయడం ద్వారా మాత్రమే సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు. రైతుల ఆత్మహత్యలకు సామాజికవేత్తలతో పాటు విద్యార్థులు కూడా శాస్త్రీయ పరిష్కారం కనుగొనాలంటే ఈ గ్రంథం తోడ్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కె.కృష్ణయ్య, బి.రామానాయుడు, రాజగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

ఊపందుకున్న ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం


వాకర్స్‌తో ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి


లంకెలపాలెంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న ప్రసాద్, ఈశ్వరరావు

పెదగంట్యాడ: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మద్దతు అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి ఆధ్వర్యంలో దల్లివానిపాలెంలో ఆదివారం ప్రచారం చేపట్టారు. సీతంరాజు సుధాకర్‌కు తొలి ప్రాధాన్యత ఓటు వేయాలని పట్టభద్రులను అభ్యర్థించారు. నాయకులు పాల్గొన్నారు.

65వ వార్డులో..

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు కోరారు. ఈ మేరకు వార్డు పరిధిలోని అశోక్‌నగర్‌లో ఆదివారం ఆయన జోరుగా ప్రచారం చేశారు. పట్టభద్రులను నేరుగా కలిశారు. మొదటి ప్రాధాన్యత ఓటును సీతంరాజు సుధాకర్‌కు వేయాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో మంగునాయుడు, జుత్తు లక్ష్మీ, దేముడు, పెంద్ర రాజు తదితరులు పాల్గొన్నారు.

76వ వార్డు పెదకోరాడలో..

వైఎస్సార్ సీపీ 76వ వార్డు అధ్యక్షుడు దొడ్డి రమణ ఆధ్వర్యంలో వార్డు పరిధిలోని పెదకోరాడలో ప్రచారం చేశారు. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని పట్టభద్రులను కోరారు. ఈ కార్యక్రమంలో తాటికొండ జగదీష్, అచ్యుత్, ప్రమీల, నరసింహమూర్తి పాల్గొన్నారు.

75వ వార్డులో టీడీపీ నాయకుల ప్రచారం..

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి డాక్టర్ వేపాడ చిరంజీవిరావును గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ నాయకులు 75వ వార్డు పరిధిలోని పెదగంట్యాడ, ముసలినాయుడుపాలెంలో జోరుగా ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో పులి వెంకటరమణారెడ్డి, నమ్మి అప్పారావు, పెరుమాళ్, నామాల పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

సీతంరాజుకు మద్దతుగా ఎమ్మెల్యే ప్రచారం

గాజువాక: వైఎస్సార్‌సీపీ మద్దతుతో ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలో ఉన్న సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి కోరారు. ఈ మేరకు ఆయన స్థానిక వుడా కాలనీ ఆదర్శ గ్రౌండ్, అమరావతి పార్కులలో వాకర్లను కలిసి సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా ప్రచారం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు భూపతిరాజు సుజాత, రాజాన రామారావు, వైఎస్సార్ సీపీ నాయకులు మార్టుపూడి పరదేశి, రాజాన వెంకటరావు, అండిబోయిన లక్ష్మి, గొందేశి వెంకట రమణారెడ్డి, గొరుసు సత్యంరెడ్డి, గొందేశి మహేశ్వరరెడ్డి, వెంపాడ అప్పారావు, రెడ్డి జగన్నాథం, ములకలపల్లి వెంకటేష్, కులుకూరి మంగరాజు, నందికి తాతారావు, మంత్రి శంకరనారాయణ, పిట్టా రెడ్డి, గొందేశి ప్రభాకరరెడ్డి, ఎన్నేటి రమణ, గేదెల మధుసూదన్‌రెడ్డి, అండిబోయిన అప్పారావు, బిఎస్‌ఎం రాజా, మొల్లి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

79వ వార్డులో..

అగనంపూడి: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపర్చిన సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని 79వ వార్డు అగనంపూడి ప్రశాంతినగర్‌లో ఓటర్లకు అభ్యర్థించారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జ్ అప్పికొండ మహాలక్ష్మినాయుడు, మండల కన్వీనర్ వాడపల్లి రామచంద్రరాజు తదితరులు పాల్గొన్నారు. 85వ వార్డు లంకెలపాలెంలో వార్డు కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి ప్రసాద్, పెందుర్తి నియోజకవర్గం బీసీ సెల్ అధ్యక్షుడు కింతాడ ఈశ్వరరావు, సచివాలయ కన్వీనర్ దాసరి ప్రకాష్‌ల సారథ్యంలో సీతంరాజుకు ఓటేయాలని కోరుతూ ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. టీడీపీ ఎమ్మెల్సీఅభ్యర్థి వేపాడ చిరంజీవిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని 79వ వార్డులోని అగనంపూడి వాకింగ్ ట్రాక్ వద్ద వాకర్స్‌ను విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు, నాయకులు పాల్గొన్నారు.

87వ వార్డులో ..

కూర్మన్నపాలెం: తెలుగుదేశం పార్టీ బలపరిచిన ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ అభ్యర్థి వేపాడ చిరంజీవిరావును గెలిపించాలని 87వ వార్డు కార్పొరేటర్ బొండా జగన్నాథం ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. వార్డులోని కణితి నిర్వాసితకాలనీ, లక్ష్మీపురంకాలనీ, అంబేడ్కర్‌కాలనీ, రామకృష్ణ పబ్లిక్ స్కూల్ తదితర ప్రాంతాల్లో ఓటర్లను కలిసి ఓటు వేయాలని కోరుతూ కరప్రతాలను పంపిణీ చేశారు.

సీతంరాజును గెలిపించుకుందాం

గాజువాక: వైఎస్సార్‌సీపీ మద్దతుతో ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరుతూ ఆ పార్టీ నాయకులు 72వ వార్డులో ఆదివారం విస్తృత ప్రచారం నిర్వహించారు. వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి సిరట్ల శ్రీనివాస్ (వాసు) ఆధ్వర్యంలో గ్రాడ్యుయేట్లను కలిసి ఓట్లను అర్థించారు. కార్యక్రమంలో నాయకులు సంతోష్, పద్మ, వరలక్ష్మి, వాసవి నాయుడు, పరీదుల శ్రీనివాస్, దీప్తి, మధు, కుమార్‌సాయి, అప్పలరాజు, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ఉక్కునగరంలో మాధవ్ ప్రచారం

ఉక్కునగరం: బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి పీవీఎన్ మాధవ్ ఉక్కునగరంలో ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఉక్కు క్వార్టర్లలోని తృష్ణ గ్రౌండ్స్‌లో పట్టభద్రుల ఓటర్లను కలిసి తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. తనను గెలిపిస్తే విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి బీజేపీ ఎల్లప్పుడు కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కరణంరెడ్డి నర్సింగరావు, దీనంకొండ కృష్ణంరాజు, గూటూరు శంకరరావు, బొండా ఎల్లాజీరావు, శ్రీదేవి, శ్రీరామ్మూర్తి, ప్రసాద్ శర్మ, రోహిణి, రాజేశ్వరి, పద్మ, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.


ప్రచారంలో పాల్గొన్న పీవీఎన్ మాధవ్


ఓటర్లకు కరపత్రాలను పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

కళాకారుల వైద్య శిబిరం విజయవంతం


శిబిరంలో సేవలందిస్తున్న వైద్యుల బృందం

దాబాగార్డెన్స్: విశాఖ స్మార్ట్‌సిటీ లయన్స్‌క్లబ్, విశాఖ సంగీత కళాకారుల సంక్షేమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో దాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఆదివారం నిర్వహించిన కళాకారుల మెగా వైద్య శిబిరం విజయవంతమైంది. సుమారు 300 మంది కళాకారులు పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. నగరానికి చెందిన ప్రముఖ వైద్యుల పర్యవేక్షణలో షుగర్, బీపీ పరీక్షలతో పాటు దంత పరీక్షలు, కంటి పరీక్షలు నిర్వహించారు. జనరల్ ఫిజీషియన్స్ డాక్టర్ కృష్ణ హారిక, సాయి లక్ష్మి, కృష్ణకీర్తి, ఉమా ప్రవల్లిక పాల్గొని అవసరమైన పరీక్షలు చేసి మందులు, కళ్లజోళ్లు అందజేశారు. అనంతరం క్యాన్సర్ వైద్య నిపుణురాలు డాక్టర్ శ్రీప్రభ ఆ వ్యాధిపై అవగాహన కల్పించారు. ముందుగా స్మార్ట్‌సిటీ అధ్యక్షుడు ఎం. త్రినాథరావు, లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఉషారాజు శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జోనల్ చైర్ పర్సన్ రోహిణిరాజు, క్యాబినెట్ సెక్రటరీ యు. జానకీదేవి, కోశాధికారి ఐఎస్‌ఎన్ రాజు, ఎం. విజయలక్ష్మి, ఎం. గోపాల్, కళాకారుల సంఘం గౌరవ అధ్యక్షుడు కొణతాల రాజు, అధ్యక్షుడు మహ్మద్‌ఖాన్, ప్రధాన కార్యదర్శి చెన్నా తిరుమలరావు, మెలోడి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అపూర్వ కలయిక


కణితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కలిసిన 2004-05 బ్యాచ్ విద్యార్థులు

కూర్మన్నపాలెం: ప్రతి ఒక్కరి జీవితంలో గుర్తుండే తీపి జ్ఞాపకాలు చిన్నతనంలోనే ఉంటాయి. చదువుకునే రోజుల్లో చేసే అల్లరి, తోటి స్నేహితుల కోసం చేసిన త్యాగాలు, వారితో కలిసి ఆడిన ఆటలు, చిన్న చిన్న గ్యాంగ్‌లు, అవన్నీ ఓ మధురమైన క్షణాలు. మళ్లీ అవన్నీ గుర్తు చేసుకుంటూ సరిగ్గా 18 ఏళ్ల తరువాత వారంతా ఆనందడోలికల్లో మునిగిపోయారు. ఆ మధుర స్మృతులకు వేదికైంది కణితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల. 2004–05 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదువుకున్న విద్యార్థులు 18 ఏళ్ల తర్వాత వారు చదివిన కణితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కలుసుకున్నారు. నాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. చిన్ననాటి మిత్రులందరు ఒకరినొకరు ఆలింగనం చేసుకుని, అప్పట్లో వారికి విద్యా బోధన చేసిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాయుడు, శ్రీనివాస్, రమణ, నూకరాజు, సుధాకుమారి, గణేష్, పూర్వ విద్యార్థులు మాటూరి రాము, ఆకుల పరదేశమ్మ, లక్ష్మి, ఇంజరపు శ్రీను, రాంబాబు, కుమార్, సతీష్, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

కాపు కల్యాణ మండపానికి రూ.2 లక్షల సాయం


కాపు సంఘం నాయకులకు చెక్కు అందజేస్తున్న నర్సింగరావు

గాజువాక: పాతకర్ణవానిపాలెంలోని శ్రీకృష్ణదేవరాయ నూతన ఏసీ కల్యాణ మండపానికి బీజేపీ గాజువాక కో ఆర్డినేటర్ కరణంరెడ్డి నర్సింగరావు రూ.2 లక్షల ఆర్థిక సాయం అందజేశారు. ఈ మొత్తాన్ని కల్యాణ మండప అడ్‌హక్ కమిటీ ఛైర్మన్ గుడివాడ అమ్మన్న, ప్రతినిధులు గంధం వెంకటరావు, కర్రి నాగేశ్వరరావులకు ఆదివారం అందజేశారు, నర్సింగరావు తమ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం కల్యాణ మండపానికి రూ.5లక్షల ఆర్థిక సాయం అందిస్తానని చెప్పడం హర్షణీయమని ఈ సందర్భంగా సంఘం నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాపు సంఘం నాయకులు ఇందల ఈశ్వరరావు, జగదీష్, గూటూరు శంకరరావు, ప్రభాకరరావు, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘ కార్యవర్గాల ప్రమాణ స్వీకారం


ప్రమాణ సీకారోత్సవంలో పాల్గొన్న కార్యవర్గాల సభ్యులు

గాజువాక: గాజువాక, పెదగంట్యాడ మండలాల ఆర్యవైశ్య సంఘం కార్యవర్గాల ప్రమాణస్వీకారోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. గాజువాక ఆర్యవైశ్య సంఘం, జిల్లా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గాజువాక మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష కార్యదర్శులుగా గునిశెట్టి అప్పల సత్యనారాయణ గుప్త, కారుమూరి రామకృష్ణ, కోశాధికారిగా కట్ట సత్యానందం, గంట్యాడ మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా సీరం రామారావు, కోశాధికారిగా చెరుకూరి వెంకటరమణ బాధ్యతలను స్వీకరించారు. కార్యక్రమంలో జిల్లా సంఘం అధ్యక్షుడు కట్ట వెంకట సత్యనారాయణ, నున్న మహేష్, ఆంధ్ర మహాసభ కార్యదర్శి గుంపిన రఘునాథ గుప్త, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు కులుకూరి మంగరాజు తదితరులు పాల్గొన్నారు.